జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 176 12-7-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
జాతీయ దిన పత్రిక తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



# మూగబోయిన స్వర కోయిల

- కోట్లాది హృదయాలు గెలుచుకున్న విఖ్యాత గాయని ఎస్.జానకి కన్నుమూత
- వృద్ధాప్య సమస్యలతో బాధ పడుతూ మైసూరు ఆస్పత్రిలో చికిత్స
- మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో గుండెపోటుతో తనువు చాలింపు
- ప్రజల సందర్శనార్థం నేటి ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మహారాజ కాలేజ్ గ్రౌండ్స్‌లో పార్థివదేహం
- ప్రభుత్వ లాంఛనాలతో మైసూరు బోగాదిలో నేటి సాయంత్రం అంత్యక్రియలు

మైసూరు/బెంగళూరు/తెనాలి: తేనెలూరు తెలుగువారి గళ మాధుర్యాన్ని అనేక భాషల్లో శ్రోతలకు రుచి చూపించి మన కీర్తి పతాకను దశ దిశలా ఎగురవేసిన స్వర కోయిల మూగవోయిందన్న వార్త సంగీత ప్రియులను దిగ్భ్రాంతికి గురిచేసింది. తన పాటలతో జగమే ఊయల చేసిన మధుర గాయని ఎస్.జానకి ఇక లేరన్న చేదు వార్త విని సర్వత్రా ఆవేదన వ్యక్తమైంది. తన సుమధుర కంఠంతో ఆబాలగోపాలాన్ని ఓలలాడించిన బహుభాషా గాయని ఎస్.జానకి (88) శనివారం రాత్రి మైసూరు నగరంలో గుండెపోటుతో కన్నుమూశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా రేపల్లె పాత తాలూకాలోని నిజాంపట్నం మండలం పల్లపట్ల వాస్తవ్యురాలైన ఆమె ఆరేళ్లుగా మైసూరు బన్నూరు రోడ్డులోని ఫార్మ్‌హౌజ్‌లో నివాసం ఉంటున్నారు. ఎల్లప్పుడూ ధవళ వర్ణ సంప్రదాయ చీరకట్టులో కనిపించేవారు.

- మిగతా 2వ పేజీలో






### పోక్సో కేసు కక్షతో రక్తపాతం..!

# ఆరుగురి ప్రాణాలు బలి

- కత్తితో పొడిచి, గొంతులు కోసి హతమార్చిన కిరాతకుడు
- బాలికపై అత్యాచారం చేసి ఆపై హత్య!
- షాబాద్ మండలంలో శుక్రవారం అర్ధరాత్రి ఘాతుకం.. పరారీలో నిందితుడు... ఆచూకీ చెప్పిన వారికి రూ.2 లక్షల నజరానా
- ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి ప్రకటన
- పోక్సో కేసులో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలతో సీఐ, ఎస్ఐ సస్పెన్షన్.. బాధిత కుటుంబం ఆందోళనలతో అట్టుడికిన షాబాద్



బాలిక



లక్ష్మి



రుక్కమ్మ






రాజ్‌కుమార్ భార్య సరిత, కుమారులు పరీక్షిత్, దైవిక్షిత్

రంగారెడ్డి జిల్లా: పోక్సో కేసులో నిందితుడు పగతో రగిలిపోయాడు. రాక్షసుడిలా మారాడు. వరుసబెట్టి ఆరుగుర్ని అతి కిరాతకంగా హత్య చేశాడు. తనపై ఫిర్యాదు చేసిన బాలిక, ఆమె తల్లి, నానమ్మను మట్టుబెట్టిన ఈ రాక్షసుడు, వారికి మద్దతుగా నిలిచిందనే కోపంతో కట్టుకున్న భార్యను, అభం శుభం తెలియని ఇద్దరు కొడుకుల్నీ కడతేర్చాడు. శుక్రవారం అర్ధరాత్రి ఈ హత్యాకాండ చోటు చేసుకోగా, శనివారం ఉదయం ఈ ఘోరం సంచలనం సృష్టించింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో ఈ మారణకాండ జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దైవాలగూడకు చెందిన పార్వతి అరుణ్‌కుమార్, శకుంతల దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

- మిగతా 2వ పేజీలో



### తాడూ లేదు బొంగరం లేదు...

# సర్వేలు ఇప్పుడెందుకు చేయిస్తాం

డీలిమిటేషన్, మహిళా బిల్లు, జమిలి ఎన్నికలు ఖాయంగా వస్తాయి

- పూరీలు చేయమని మనుమడు అడిగితే చేశాను
- ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ చైర్మన్‌గా సీఎంకు ఇక్కడ క్యాంప్ ఆఫీస్ ఉంటుంది
- వందల కోట్లు ఖర్చు పెట్టాననడంలో వాస్తవం లేదు
- ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్: యాదగిరిగుట్ట దేవస్థా నం బోర్డు సభ్యుల నియామకం తన శాఖ పరిధిలోకే వస్తుందని, వైటీడీఏ మున్సిపల్ శాఖ పరిధిలో ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈబోర్డు సభ్యుల నియామకంలో తాను ఎవరినీ సంప్రదించలేదన్న ఆరోపణల్లో పస లేదని, తన శాఖ పరిధిలోకి వస్తుంది కనుకనే దేవాలయానికి అవసరమైతే ఓ పది కోట్లు విరాళంగా ఇవ్వగలిగిన వారిని చూసి సభ్యులుగా నియమించామని చెప్పా రు. ఈ బోర్డులో నల్లగొండ జిల్లా వారే ఉండాలన్న నిబంధన లేదని,

- మిగతా 2వ పేజీలో

## రైతాంగాన్ని రేవంత్ నిలువునా ముంచేస్తున్నారు

- మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూయకుండానే కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేయవచ్చన్న కేటీఆర్
- 100 రోజుల్లో 200 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని వ్యాఖ్య
- కాళేశ్వరంను బద్నాం చేయాలనే కుట్రతోనే నీళ్లు ఇవ్వడం లేదని ఆరోపణ

2లో

## వియత్నాంలో బోటు ప్రమాదం...

- భారత ఎంబసీతో మాట్లాడిన మంత్రి నారా లోకేశ్
- వియత్నాంలో పడవ బోల్తా పడి 15 మంది భారతీయులు మృతి
- మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఉన్నట్లు వెల్లడి
- స్పందించిన మంత్రి నారా లోకేశ్, ఎంబసీ అధికారులతో సంప్రదింపులు
- బాధితులకు అన్ని విధాలా సాయం అందిస్తామని హామీ
- కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని ఢిల్లీ ఏపీ భవన్ అధికారులకు ఆదేశం



## జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తు

- విజయవాడలో జరిగిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు
- జనాభా నియంత్రణ నుంచి సంరక్షణ వైపు ప్రభుత్వ విధానం
- 'పిల్లలే సంపద' పేరుతో కొత్త కార్యక్రమానికి నాంది
- యువత నైపుణ్యం, వృద్ధుల అనుభవం దేశానికి ఆస్తి అన్న సీఎం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన మార్పుపై సంకేతం
- మైక్రో కుటుంబాల కన్నా ఉమ్మడి కుటుంబాలే మేలని వ్యాఖ్య

జనాభా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర జనాభా విధానంపై ఒక సంచలనాత్మక, కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వాలు అనుసరించిన 'జనాభా నియంత్రణ' విధానానికి

## షాబాద్ హంతకుడికి... సీఎం రేవంత్‌కు తేడా లేదు

- సీఎం, హోంమంత్రిగా రేవంత్‌రెడ్డి విఫలం.. తక్షణమే రాజీనామా చేయాలి: హరీశ్‌రావు
- రక్తపాతాన్ని కోరుకుంటున్న రేవంత్ ప్రజలు, రైతులకు క్షమాపణ చెప్పాలి
- పోలీస్ స్టేషన్లను ల్యాండ్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మార్చేశారు
- వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే 'కాళేశ్వరం' డైవర్షన్ డ్రామాలు
- బీఆర్ఎస్ శాసనసభ పక్ష డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

2లో

## ఇక వ్యూహాత్మక భాగస్వామ్యం

- మరింత ఉన్నత స్థాయికి భారత్--న్యూజిలాండ్ సంబంధాలు
- వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి రూ. 35,000 కోట్లకు..
- ఇరుదేశాల ప్రధానమంత్రులు మోదీ, లక్సన్ భేటీలో నిర్ణయం
- కీలక రంగాల్లో పరస్పర సహకారానికి 10 ఒప్పందాలు
- క్రీడలపై సంయుక్త కార్యాచరణ ప్రణాళిక ఖరారు



ఆదివారం
12-07-2026

తెలంగాణ

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# రైతాంగాన్ని రేవంత్ నిలువునా ముంచేస్తున్నారు

తెలంగాణలో సాగునీటి సంక్షోభం, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన కేటీఆర్ మాట్లాడుతూ.. రాజకీయ కక్షతో సీఎం రేవంత్ రెడ్డి రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి సీఎం సోయి తెచ్చుకోవాలని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని ఫోరం సూచించిందని తెలిపారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల నీటి ప్రవాహం ఉందని చెప్పారు. 94 మీటర్ల లభ్యత వద్దే పంపులు ఆన్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారన్నారని... ఈ లెక్కన నీటిని పంప్ చేయవచ్చని అన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నా ఈ ప్రవాహం మరో 100 రోజులు కొనసాగుతుందని... రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే గోదావరి బేసిన్‌లోని అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు. కానీ రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే కుట్రతో నీళ్లివ్వడం లేదని ఆరోపించారు. 'ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరవు' అని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన కొనసాగితే కాంగ్రెస్‌కు 117 సీట్లు కాదు కదా... 7 సీట్లు కూడా రావని హెచ్చరించారు.

# వియత్నాంలో బోటు ప్రమాదం...

వియత్నాంలో ఘోర పడవ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 15 మంది భారతీయులు జలసమాధి అయ్యారు. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు కూడా ఉన్నారని తెలియడంతో రాష్ట్రంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై ఏపీ ప్రభుత్వం తక్షణమే స్పందించి, సహాయక చర్యలకు ఉపక్రమించింది. ఈ విషయం తెలియగానే రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వియత్నాంలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదం జరిగిన తీరు, ప్రస్తుత పరిస్థితుల గురించి ఆరా తీశారు. బాధితులకు తక్షణమే అవసరమైన సహాయం అందించాలని ఆయన ఎంబసీ అధికారులను కోరారు. ముఖ్యంగా, ప్రమాదంలో మరణించిన తెలుగువారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులకు మంత్రి లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సాయం అందించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆయన సూచించారు.

## షాబాద్ హంతకుడికి... సీఎం రేవంత్‌కు తేడా లేదు

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో పోక్సో కేసు నిందితుడు ముగ్గురు పసిపిల్లలతో సహా ఆరుగురిని కిరాతకంగా చంపేయడం ప్రభుత్వ, పోలీసుల వైఫల్యమేనని బీఆర్ఎస్ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. హోంమంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని, తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అనంతరం 'ఎక్స్'లోనూ కొన్ని వ్యాఖ్యలు పోస్ట్‌చేశారు. 'రేవంత్‌కు షాబాద్ హంతకుడికి తేడా లేదు. రైతులు సాగునీరు అడిగితే ప్రతిపక్షాల రక్తాన్ని పంటలపై చల్లాలని మాట్లాడిన ముఖ్యమంత్రి వెంటనే ప్రజలకు, రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి'అని తీవ్రస్థాయిలో విమర్శించారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ఆయన శాడిస్టిక్ మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. పోలీసుల నిర్లక్ష్యంతో బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు మరోసారి దారుణ హత్యాకాండకు పాల్పడ్డాడన్నారు. మే 16న మైనర్ బాలికపై అత్యాచారం జరిగితే.. నిందితుడిని అరెస్ట్ చేయడంలో పోలీసులు ఘోరంగా విఫలమయ్యారన్నారు. అవినీతికి, రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోయిన పోలీసులు.. నెల రోజులపాటు అతన్ని అరెస్ట్ చేయకుండా వదిలేయడంతో.. అతను కోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకుని ఈరోజు ఆ కుటుంబాన్నే అంతం చేశాడని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలనా వైఫల్యాలు బయటపడినప్పుడల్లా ప్రజల దృష్టి మళ్లించేందుకు కాళేశ్వరం పేరుతో డైవర్షన్ రాజకీయాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటైందని ఆరోపించారు. 'రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను రేవంత్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించింది. పోలీస్ స్టేషన్లను ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టడానికి, ల్యాండ్ సెటిల్‌మెంట్లకు అడ్డాలుగా మార్చేశారు. షాబాద్ ఘటనలో ప్రాణహాని ఉంది, రక్షణ కల్పించండని బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగి మొత్తుకున్నా పట్టించుకోలేదు. ఈ కిరాతక ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబంలో మిగిలిన దివ్యాంగ చిన్నారి పేరు మీద ప్రభుత్వం రూ.కోటి ఫిక్స్ డిపాజిట్ చేసి ఆ అమ్మాయిని పెంచే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలి'అని హరీశ్‌రావు చెప్పారు.

# ఇక వ్యూహాత్మక భాగస్వామ్యం

అక్లాండ్: భారత్--న్యూజిలాండ్ స్నేహం మరింత బలపడింది. ఇరుదేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకున్నాయి. వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రూ.35,000 కోట్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి. సముద్ర భద్రత విషయంలో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించాయి. న్యూజిలాండ్‌లోని అక్లాండ్‌లో శనివారం భారత ప్రధాని మోదీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సమావేశమయ్యారు. రెండుదేశాల సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. శాంతియుత ఇండో--పసిఫిక్ దిశగా ఉమ్మడిగా కృషి చేయాలని తీర్మానించారు. ఇరువురు నేతల భేటీ సందర్భంగా భారత్, న్యూజిలాండ్ మధ్య 10 కీలక ఒప్పందాలు కుదిరాయి. మొత్తంగా 18 అంశాలపై అంగీకారానికి వచ్చారు. ద్వైపాక్షిక సంబంధాలను విస్తరించడానికి నాలుగేళ్ల రోడ్‌మ్యాప్, హైడ్రోగ్రాఫిక్ డేటా షేరింగ్‌ను ప్రోత్సహించడం, పరస్పర నావికాదళ లాజిస్టిక్స్‌ను సులభతరం చేయడం, ఇండో--పసిఫిక్‌లో మెరుగైన సముద్ర సంబంధాలను రూపొందించడం వంటివి ఇందులో ఉన్నాయి. రాబోయే 15 ఏళ్లలో భారత్‌లో న్యూజిలాండ్ 20 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టే అంశంపై చర్చ జరిగింది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని(ఎఫ్‌టీఏ) త్వరగా అమలు చేయడం ద్వారా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరింపజేసుకోవాలని నిర్ణయానికి వచ్చారు. చర్చల కోసం గవర్నమెంట్ హౌస్‌కు చేరుకున్న మోదీకి సంప్రదాయ స్వాగతం లభించింది. స్వేచ్ఛాయుత, బహిరంగ, సుసంపన్నమైన ఇండో--పసిఫిక్ పట్ల ఉమ్మడి నిబద్ధతను మోదీ, లక్సన్ పునరుద్ఘాటించారని ఇరుదేశాలు ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, నియమాల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థను పరిరక్షించాల్సిన ప్రాముఖ్యతను వారు ప్రస్తావించారని తెలిపాయి.

# మూగబోయిన స్వర కోయిల

(మొదటి పేజీ తరువాయి)

కొన్నేళ్లుగా వయోభారం, అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. ఇటీవలే బోగాది నగరలోని ఎస్‌బీఎం లేఔట్ నివాసంలో అద్దెకు ఉంటున్నారు. నవీన్, పవన్ అనే వ్యక్తులు ఆమెకు తోడునీడగా ఉంటూ సేవలు చేస్తూ వచ్చారు. వారం క్రితమే ఆమె మంగళూరుకు తన అక్క ఇంటికి వెళ్లి తిరిగి వచ్చారు. ఈ సమయంలో ఆమెతో పాటు కోడలు ఉమా, మనమరాలు అప్సరా కూడా ఉన్నారు. గత సంవత్సరం ఆమె తన కుమారుడు మురళీకృష్ణను కోల్పోవడంతో తీవ్ర మానసిక కుంగుబాటుకు గురయ్యారు. బయటి ప్రపంచంతో సంబంధాలు తెంచుకుని మౌనంగా ఉండిపోయారు. ఈ క్రమంలో శనివారం ఆమె ఆరోగ్యం క్షీణించడంతో మధ్యాహ్నం 12.49 గంటలకు మైసూరులోని అపోలో ఆసుపత్రిలో చేర్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు వెంటనే ఐసీయూకు తరలించి చికిత్స అందించారు. అయినా ఆమె మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ (బహుళ అవయవ వైఫల్యం)తో గుండెపోటుకు గురయ్యారు. రాత్రి 7.30 గంటలకు ఆమె మరణించారని ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. విషయం తెలుసుకుని ఆమె బంధువులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అభిమానులు ఆస్పత్రి వద్దకు భారీగా తరలివచ్చారు. ఆమె అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం 5 గంటలకు మైసూరు బోగాది సమీపంలోని కణియర హుండి గ్రామంలోని ఫామ్‌హౌజ్‌లో జరుగుతాయని బంధువులు మీడియాకు తెలిపారు. అంతంకు ముందు ఆమె పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మైసూరులోని మహారాజ కాలేజ్ గ్రౌండ్స్‌లో ఉంచుతారు. ప్రభుత్వ లాంఛనాలతో జానకి అంత్యక్రియలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

### ఆటుపోట్ల జీవితం

ఎస్.జానకి తన తీయని కంఠం ద్వారా ప్రజలను ఎంతగా ముగ్ధుల్ని చేశారో ఆమె జీవితం అంతగా ఆటుపోట్లకు గురైంది. 1938 ఏప్రిల్ 23న సత్యవతి, శ్రీరామమూర్తి దంపతులకు జన్మించారు. తండ్రి ఆయుర్వేద వైద్యుడు. ఆరుగురు అక్కాచెల్లెళ్లలో నాలుగో సంతానం జానకి. చదువంటే శ్రద్ధ లేదు. బడి అంటే ఆమడదూరం వెళ్లేవారు. రేడియోలో పాటలు వింటూ కాలక్షేపం. రోడ్డుపైకి వెళ్లినపుడు లతా మంగేష్కర్ పాటలు వింటూ, తాను పాడుతూ పెరిగారు. వివిధ కారణాలరీత్యా శ్రీరామమూర్తి కుటుంబం కొంతకాలం కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో, తర్వాత రాజమండ్రిలో ఉన్నారు. సిరిసిల్లలోనే తన బాల్యం, ప్రాథమిక విద్యాభ్యాసం సాగింది. తన చిన్నతనంలో తల్లిదండ్రులతో కలిసి ఎండ్ల బండిలో వేములవాడకు వెళ్లి బాలనాగమ్మ సినిమాను చూసి వచ్చినట్లు ఓ ఇంటర్వ్యూలో జానకి గుర్తుచేసుకున్నారు. పాటలపై కూతురుకు గల ఆసక్తిని గమనించిన తల్లి సత్యవతి, రాజమండ్రిలో నాదస్వర విద్వాన్ గాడవల్లి పైడిస్వామి దగ్గర సంగీతంలో ప్రాథమిక శిక్షణ ఇప్పించారు. ఆ తర్వాత ప్రత్యేకంగా శాస్త్రీయ సంగీతం ఎవరి వద్దా నేర్చుకోలేదు. గురువు గారు కీర్తనలతో ఆరంభించినా, జానకి ధ్యాసంతా సినిమా పాటలపైనే ఉండేది. అక్కడుండే 'క్రాంతి కళామండలి యూత్ అసోసియేషన్'లో సినిమా పాటల కచేరీల్లో పాటలు పాడుతున్న కాలంలో, అమ్మ మరణంతో మళ్లీ ఆ కుటుంబం హైదరాబాద్‌కు చేరుకుంది. జానకి మామయ్య 'ఫన్ డాక్టర్'చంద్రశేఖర్ వేదికపై ప్రదర్శనలిస్తుండేవారు. మధ్యమధ్యలో జానకి పాటలు పాడుతూ వచ్చారు. ఆయన కుమారుడు వి.రాంప్రసాద్, జానకి స్వరంలోని ప్రత్యేకతను గమనించారు. కుమారుడు చేసిన సూచనతో చంద్రశేఖర్, చెన్నైలోని రెండు మూడు స్టూడియోలకు జానకి గురించి లేఖ రాశారు. ఏవీఎం స్టూడియో నుంచి ఆడిషన్‌కు రమ్మని కబురొచ్?చంది. స్టూడియో స్టాఫ్‌గా ఎంపిక చేసుకున్నారు. తాను ఇష్టపడిన రాంప్రసాద్‌తోనే ఆమెకు 1959లో వివాహమైంది. పాటలకు సంబంధించిన ఒప్పందాలు, రెమ్యూనరేషన్, రాయల్టీలు అన్ని విషయాలు ఆయనే చూసుకున్నారు. 1997లో గుండెపోటుతో భర్త మృతి చెందారు. చెన్నైలో స్థిరపడిన జానకి దంపతులకు ఏకైక కుమారుడు మురళీకృష్ణ కొన్ని సినిమాల్లో నటించినా ఎక్కువకాలం కొనసాగలేదు.

# సర్వేలు ఇప్పుడెందుకు చేయిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డులో అనేక రాష్ట్రాల సభ్యులుంటారని ఆయన గుర్తు చేశారు. శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం అనంతరం బోధ్ పెవిలియన్‌లో ఆయన విలేకరుల తో ఇష్టాగోష్టి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2029 ఎన్నికలలోపు నియోజకవర్గాల పునర్?వభజన జరుగుతుందని, మహిళా బిల్లు ఆమోదం పొందుతుందని, జమిలి ఎన్నికలు కచ్చితంగా వస్తాయని చెప్పారు. అసలు ఏ నియోజకవర్గాన్ని ఎలా విభజిస్తారో, ఏ నియోజకవర్గం ఎవరికి రిజర్వు అవుతుందో తెలియనప్పుడు తాడూ లేదు బొంగరం లేదన్నట్టు ఇప్పుడు సర్వేలు ఎందుకు చేయిస్తామని ప్రశ్నించారు. ఎవరికి ఏ స్థానం రిజర్వు అయినా తన కుటుంబంలో తాను ఒక్కడినే రాజకీయాల్లో ఉంటానని, అందులో ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశారు. తాను పూరీలు చేసిన వీడియో వైరల్ అయిందన్న విషయం విలేకరులు తన దృష్టికి తీసుకురాగా, తన మనుమడు పూరీలు చేయమని అడిగితే చేశానని చెప్పారు. తాను ముఖ్యమంత్రిని అయ్యాక గతంలో ఉన్న ఏ పథకాన్ని కూడా నిలిపివేయలేదని, అన్ని పథకాలు కొనసాగిస్తున్నానని చెప్పారు.

### క్యాంపు ఆఫీసును విలేకరులకు చూపించిన సీఎం

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) చైర్మన్‌గా తన క్యాంపు ఆఫీసు ఇక్కడ పెట్టుకునే అధికారం ముఖ్యమంత్రికి ఉంటుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. తాను అధికారిక నివాసంలో ఉండటం లేదు కనుక కొన్ని స్వతంత్ర వ్యవస్థలకు చెందిన వారు అక్కడకు రావడం సరికాదని, అందుకే ఇక్కడ క్యాంపు ఆఫీసు ఏర్పాటు చేసుకున్నానని చెప్పారు. తన క్యాంపు ఆఫీసుకోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టానడడంలో వాస్తవం లేదని చెప్పిన రేవంత్‌రెడ్డి బోధ్ పెవిలియన్‌ను విలేకరులకు చూయించారు. అక్కడ సీఎం కార్యాలయం, కాన్ఫరెన్స్ హాల్, లాన్‌తోపాటు లోయర్ గార్డెన్‌తో సహా విలేకరులకు చూపించారు. చిన్న కార్యాలయంలో పనిచేస్తున్నానని, అందరికీ అందుబాటులో ఉండేలా ఇక్కడ అధికారిక సమీక్షలు చేస్తున్నానని రేవంత్ చెప్పారు.



# జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

స్వస్తి పలికి, 'జనాభా సంరక్షణ' అనే కొత్త దిశగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. "జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తు" అనే నినాదాన్ని ఇస్తూ, భవిష్యత్తులో 'పిల్లలే సంపద' అనే మాటను నిజం చేసి చూపిస్తామని ఆయన ప్రకటించారు. విజయవాడలో నేడు (జులై 11) జరిగిన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గతంలో ప్రభుత్వాలు జనాభా నియంత్రణ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాయని, అందులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారిని అనర్హులుగా ప్రకటించే నిబంధనలు కూడా తెచ్చామని చంద్రబాబు గుర్తుచేశారు. అయితే, ప్రస్తుతం మారిన పరిస్థితులకు అనుగుణంగా ఆ విధానాలను మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. "దేశమంటే మట్టి కాదోయ్–దేశమంటే మనుషులోయ్ అని గురజాడ చెప్పిన మాటల్ని మరోసారి గుర్తు చేసుకోవాలి. జనాభా నియంత్రణ కాదు, జనాభా సంరక్షణ కార్యక్రమాల్ని ప్రభుత్వం చేపడుతుంది. గతంలో మహిళల్లో అక్షరాస్యత పెరిగితే జనాభా నియంత్రణ సాధ్యమని భావించాం. 'ఒక్కరు ముద్దు, ఇద్దరితో సరి' వంటి ప్రచారాలు చేశాం. కానీ ఇప్పుడు రాష్ట్రంలో, దేశంలో ఫెర్టిలిటీ రేటు గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉంది" అని ముఖ్యమంత్రి వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా దేశాల్లో జనాభా తగ్గిపోతోందని, భారతదేశంలో ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోందని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. "అభివృద్ధి సంతులనం కావాలంటే జనాభా నిర్వహణ చాలా కీలకం. రాష్ట్రంలో అంగన్‌వాడీలు, పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో ప్రతి వంద మందిలో 89 శాతం మందికి రెండో సంతానం లేదు. విశాఖ వంటి జిల్లాల్లో ఫెర్టిలిటీ రేటు చాలా తక్కువగా ఉంది. విస్తీర్ణంలో ఏపీ 7వ స్థానంలో ఉన్నా, జనసాంద్రతలో దిగువన ఉన్నాం. పిల్లలే మన రాష్ట్ర సంపద. వారితోనే ఆర్థిక ప్రగతి" అని ఆయన అన్నారు. చిన్న కుటుంబాల భావన పెరిగిపోవడం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగు కావడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. "మైక్రో ఫ్యామిలీల గురించి యువత ఆలోచించడం ప్రమాదకరం. సంతానం వద్దనుకునే దంపతులు పెరగటం దురదృష్టకరం. భారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థే ప్రపంచానికి ఆదర్శం. పిల్లలే సంపద– ఉమ్మడి కుటుంబమే శ్రీరామ రక్ష" అని ఆయన అన్నారు. పిల్లలను పెంచడం కేవలం మహిళల బాధ్యతే కాదని, అదొక ఉమ్మడి బాధ్యత అని స్పష్టం చేశారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కాన్పుల్లో సిజేరియన్ ఆపరేషన్లు తగ్గాలని సూచించారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాల దుర్వినియోగంపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో పోక్సో నిందితుడు ఒకే కుటుంబంలో ఆరుగురిని హత్య చేసిన ఘటనను ప్రస్తావిస్తూ, సోషల్ మీడియా వ్యసనంగా మారి మానసిక సమస్యలకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. టెక్నాలజీకి ఆధ్యాత్మికతను జోడించడం ద్వారా యువత ప్రపంచాన్ని జయించగలదని ఆయన అభిప్రాయపడ్డారు.

# పోక్సో కేసు కక్షతో రక్తపాతం..! ఆరుగురి దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

రెండో కొడుకైన రాజ్‌కుమార్ (28)కు చదువు సంధ్యా లేదు. జులాయిగా తిరిగేవాడు. తల్లిదండ్రులను బెదిరించడం..ఉన్న ఆస్తులు అమ్ముకోవడం, అప్పులు చేయడం, ఖరీదైన కార్లలో తిరుగుతూ జల్సాలు చేయడం, యువతులను వేధించడం..ఇదే పని. మరోవైపు ఆన్‌లైన్ గేమ్స్ ఆడి ఆర్థికంగా నష్టపోయాడు. స్నేహితులు, బంధువుల వద్ద రూ.కోటికి పైగా అప్పు చేశాడు. చెల్లించమని అడిగితే మీ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించేవాడు. ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన తనకంటే వయసులో ఐదేళ్లు పెద్దదైన కప్పెర సరిత (32)ను ప్రేమించానంటూ ఆమె వెంటపడ్డాడు. ఆమె కుటుంబసభ్యులు అప్పటికే మరో వ్యక్తితో వివాహం నిశ్చయించినా దాన్ని చెడగొట్టాడు. 2018లో గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో సరితను పెళ్లి చేసుకున్నాడు. ఇందుకు తన తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో భార్యతో కలిసి షాబాద్‌లోని ఇంట్లో కాపురం పెట్టాడు. వారికి పరీక్షిత్ (4), దైవిక్షిత్ (2) పుట్టారు. షాబాద్‌లో పక్కింట్లో నివసిస్తున్న ఓ కుటుంబంతో రాజ్‌కుమార్ సన్నిహితంగా మెలిగేవాడు. ఆ ఇంట్లో ఉండే బాలిక (17)పై కన్నేశాడు. శంషాబాద్‌లోని కాలేజీకి వెళ్లి వచ్చేటప్పుడు ప్రేమ పేరుతో వేధించేవాడు. ఆమె తండ్రిని మంచి చేసుకునేందుకు నిత్యం మత్తులో ముంచి తేల్చేవాడు. ఏడాది క్రితం బాలిక తండ్రి మరణించడంతో రాజ్‌కుమార్ అకృత్యాలకు అడ్డులేకుండాపోయింది. విషయం తెలియడంతో బాలిక తల్లి లక్ష్మి (38) పద్ధతి మార్చుకోవాలని రాజ్‌కుమార్‌ను పలుమార్లు హెచ్చరించింది. ఫలితం లేకపోవడంతో ఆరు నెలలుగా కూతుర్ని ఇంట్లోనే ఉంచింది. స్వయంగా తానే తీసుకెళ్లి వార్షిక పరీక్షలు రాయించింది. ఈ సమయంలో బాలికను బలవంతంగా తీసుకెళ్లే ప్రయత్నం చేయడంతో మే 16న లక్ష్మి షాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు మైనర్ కావడంతో పోలీసులు పోక్సో చట్టంలోని సెక్షన్ 78, 351, 11, ఆర్/డబ్ల్యు12 కింద కేసు నమోదు చేశారు. దీంతో రాజ్‌కుమార్ అజ్ఞాతంలోకి వెళ్లాడు. నిందితుడిని అరెస్టు చేసి, జైలుకు పంపడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉండగా.. కొద్దిరోజుల తర్వాత రాజ్‌కుమార్ ముందస్తు బెయిల్ తెచ్చుకుని బయట తిరగడం ప్రారంభించాడు. ఈ నేపథ్యంలో షాబాద్‌లోని ఇంటిని ఖాళీ చేసి, స్వగ్రామమైన దైవాలగూడకు వచ్చి రెండు నెలలుగా భార్య, పిల్లలతో కలిసి అక్కడే ఉంటున్నాడు. తనపై పెట్టిన పోక్సో కేసుకు బాలిక కుటుంబ సభ్యులతో పాటు భార్య సరిత కూడా కారణమని భావించిన రాజ్‌కుమార్ ఆమెపై కూడా కక్ష పెంచుకున్నాడు. అందరినీ చంపేస్తానంటూ తరచూ భార్యతో అనేవాడు. శుక్రవారం రాత్రి బిర్యానీ ప్యాకెట్లు, బీరు బాటిళ్లు తీసుకుని దైవాలగూడలోని ఇంటికి చేరుకున్నాడు. పిల్లలకు బిర్యానీ తెచ్చానని భార్యకు చెప్పి స్వయంగా తినిపించాడు. కొద్దిసేపటి తర్వాత భార్యతో గొడవపడి కత్తితో ఆమె గొంతు కోసి చంపేశాడు. ఆ తర్వాత ఇద్దరు కుమారుల గొంతు కోసి మృతదేహాలను మంచంపై పడేశాడు. ఈ సమయంలో అరుపులు, కేకలు బయటకు వినిపించకుండా ఏసీ, కూలర్, టీవీ ఆన్‌చేసి ఉంచాడు. భార్యాపిల్లల హత్యల అనంతరం పీకల దాకా మద్యం తాగి శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో తన కారులో షాబాద్‌కు చేరుకున్నాడు. పీఆర్ఆర్ స్టేడియంలో కారును పార్కు చేసి స్టేడియం ప్రహరీ దూకి బాలిక ఇంటికి చేరుకున్నాడు.



## రాజాపేట గురుకులంలో తల్లిదండ్రుల సమావేశం

**- నూతన కమిటీ ఎన్నిక.. విద్యా ప్రగతిపై సమీక్ష**

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలురు)లో శనివారం తల్లిదండ్రుల సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ (ప్రధానాచార్యులు) విద్యార్థుల "విద్యా పురోగతి నివేదిక"ను తల్లిదండ్రులకు వివరించారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్, పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో గురుకుల విద్యార్థులు సాధించిన ఉత్తమ మార్కులు, ప్రతిభను ఆయన కొనియాడారు. విద్యార్థుల క్రమశిక్షణ, పాఠశాల హాజరు, ఆరోగ్యం, సంస్థలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై తల్లిదండ్రులతో విస్తృతంగా చర్చించారు. అనంతరం 2026-27 విద్యా సంవత్సరానికి గాను నూతన తల్లిదండ్రుల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను ప్రధానాచార్యులు అభినందించారు. సమావేశానికి అధిక సంఖ్యలో హాజరైన తల్లిదండ్రులకు, కార్యక్రమ విజయవంతానికి సహకరించిన ఉపాధ్యాయులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రేణికుంట పీఏసీఎస్ ఛైర్మన్‌కు మంత్రి కొండా సురేఖ అభినందనలు



**తొలివెలుగు, రాజాపేట:** ల రాజాపేట మండలం రేణికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన ఛైర్మన్‌గా ఎంపికైన నమిల మహేందర్ గౌడ్‌ను రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్‌ను మంత్రికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పరిచయం చేశారు. అనంతరం మంత్రి కొండా సురేఖ నూతన ఛైర్మన్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు రంగ నరేష్ గౌడ్, ఎంబీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ మెండు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## పీఏసీఎస్ ఛైర్మన్‌కు ఆత్మీయ సత్కారం



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం రేణికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన ఛైర్మన్‌గా నియమితులైన నమిల మహేందర్ గౌడ్‌ను శనివారం మండల ఆర్యవైశ్య సంఘం, మండల జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు ఉప్పల రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్‌కు ఆయన శాలువా కప్పి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఛైర్మన్ మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. తనకు ఈ పదవి లభించడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. ఈ క్రమంలో ఉప్పల రమేష్‌ను ఛైర్మన్ శాలువాతో ఘనంగా సత్కరించి తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేర్ బాలరాజు గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, రాజాపేట టౌన్ ప్రెసిడెంట్ ఐరేణి నవీన్ కుమార్, బల్ల మహేష్, సురేష్ పాల్గొన్నారు.

## మాజీ మంత్రి మోత్కుపల్లికి పీఏసీఎస్ ఛైర్మన్ శుభాకాంక్షలు

**తొలివెలుగు, రాజాపేట :** మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు జన్మదిన వేడుకల్లో రేణికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఛైర్మన్ నమిల మహేందర్ గౌడ్ పాల్గొన్నారు. శనివారం మోత్కుపల్లి నర్సింహులు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనను మహేందర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సత్కరించారు. మోత్కుపల్లి నర్సింహులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు రంగ నరేష్ గౌడ్, ఎంబీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మెండు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## యాదగిరిగుట్ట దేవస్థాన నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

- తిరుమల తరహాలో వైభవంగా నిర్వహణ
- తొమ్మిది మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన ఈవో
- 16 ఏళ్ల తర్వాత నూతన బోర్డు ఏర్పాటు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో అత్యంత వైభవంగా జరిగింది. గత 16 సంవత్సరాల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం యాదగిరిగుట్ట క్షేత్రానికి పూర్తిస్థాయి పాలకమండలిని ఏర్పాటు చేసింది. నూతన బోర్డులో మొత్తం 11 మంది సభ్యులకు గాను శనివారం 9 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థానం ఈవో భవాని శంకర్ స్వామివారి గర్భాలయం వద్ద గల బంగారు వాకిలి సమీపంలో తొమ్మిది మంది సభ్యులతో విడివిడిగా ప్రమాణ స్వీకారం చేయించారు. బోర్డు చైర్మన్‌గా సత్యనారాయణ రెడ్డి, సభ్యులుగా బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి, కొణిదల సురేఖ, చిరప్పగారి విజయరాజం, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, స్వాతి కంఠమణి, రాఘవేంద్రరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, సభ్యులు తూళ్ల విజయేందర్, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త నరసింహమూర్తిలతో పాటు ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ ప్రక్రియ మధ్యాహ్నం 1 గంట వరకు సాగింది. అనంతరం నూతన పాలకమండలి సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భువనగిరి-నల్గొండ రహదారి మరమ్మతులు చేపట్టాలి

- ప్రమాదాలకు గురవుతున్న ప్రజలను పట్టించుకోవడం లేదన్న సీపీఎం
- అక్కంపల్లి స్టేజి వద్ద రాస్తారోకో.. మరమ్మతులకు డిమాండ్



**తొలివెలుగు, వలిగొండ :** భువనగిరి – నల్గొండ ప్రధాన రహదారిపై అక్కంపల్లి నుంచి టేకులసోమారం వరకు గుంతలతో దెబ్బతిన్న బీటీ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. రహదారి దుస్థితి కారణంగా ప్రజలు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. ఈ మేరకు శనివారం అక్కంపల్లి స్టేజి వద్ద సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, అక్కంపల్లి నుంచి టేకులసోమారం వరకు అనేక చోట్ల భారీ గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు, ఆటో, కారు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో గుంతల కారణంగా పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని, పలువురు కాళ్లు, చేతులు విరిగేలా గాయపడిన ఘటనలు జరిగినప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. రహదారి మరమ్మతుల విషయంలో స్థానిక ఎమ్మెల్యే కూడా చొరవ చూపడం లేదని ఆరోపించిన ఆయన, వెంటనే గుంతలను పూడ్చి రహదారిని ప్రయాణానికి అనువుగా మార్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించకపోతే పరిసర గ్రామాల ప్రజలను సమీకరించి పెద్దఎత్తున రహదారి దిగ్బంధన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు కల్కూరి ముత్యాలు, నాయకులు కొండూరు సత్తయ్య, ఉండ్రాటి పాపయ్య, శీలం ఇందిర, చేగురి నగేష్, వేముల నాగరాజు, మైసొల్ల నరేందర్, ఆవనగంటి గణేష్, సల్మాన్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండ మండల గ్రంథాలయ అధ్యక్షుడిగా ఆదిమూలం సోమేశ



- గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ
- నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడి

**తొలివెలుగు, వలిగొండ :** వలిగొండ మండల గ్రంథాలయ నూతన అధ్యక్షుడిగా ఆదిమూలం సోమేశ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గ్రంథాలయాల అభివృద్ధితో పాటు విద్యా వ్యాప్తికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉపయోగపడే విధంగా సరికొత్త స్టడీ మెటీరియల్, కరెంట్ అఫైర్స్ పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన గ్రంథాలు, దినపత్రికలను మండలంలోని గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రంథాలయాలను విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ బాధ్యతను తనకు అప్పగించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి ఆదిమూలం సోమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు బత్తిని సహదేవు గౌడ్, పోలేపాక జానకిరాము, స్థానిక సర్పంచ్ వెంకట్ పాపిరెడ్డి, నూతి రమేష్ రాజ్, తుమ్మల యుగేందర్ రెడ్డి, పాశం సత్తిరెడ్డి, బత్తిని లింగయ్య గౌడ్, చెరుకు శివయ్య గౌడ్, చిల్లూరి సత్తిరెడ్డి, రచమల్ల తిరుపతయ్య, కాసుల వెంకన్న గౌడ్, ఎం.డి. కుర్షిద్, మైసోళ్ల ప్రవీణ్, బత్తిని వరుణ్ గౌడ్, కూర వెంకటేష్, నాగేష్, కౌడే కృష్ణ, సుంకి మహేందర్, సయ్యద్, కొండూరు సాయి, కూర నర్సింహా, ప్రవీణ్, శ్రీకాంత్, అరుణ్, రమేష్, సత్యనారాయణ, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు

**- కేక్ కట్ చేసి, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసిన బీజేపీ నాయకులు**

**తొలివెలుగు, రామన్నపేట :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను రామన్నపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి అక్కేనపల్లి సైదులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామన్నపేటలోని సుభాష్ సెంటర్ వద్ద కేక్ కట్ చేసి బండి సంజయ్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామన్నపేట మండల ఏరియా ఆసుపత్రిని సందర్శించి రోగులకు పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాసేవే బీజేపీ లక్ష్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య, రామన్నపేట మండల ఇన్‌చార్జి కోరవి శంకర్, మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఏల్లా సంజీవ్ రెడ్డి, వనం అంజయ్య, సింగం లింగస్వామి, మండల ప్రధాన కార్యదర్శులు జంగిలి సత్యనారాయణ, శివకుమార్, బట్టె రమేష్, మండల కార్యదర్శులు బాత్క నరేష్, శానకొండ మల్లికార్జున్, సిరిపురం ఉపసర్పంచ్ ముదుదుడ్ల రమేష్, వార్డు సభ్యులు, బీజేపీ యువ నాయకులు కారంపూడి సాయి, ఏలే వెంకటనర్సయ్య, గంజి సత్యం, పండుగ నరసింహ, సంగిశెట్టి నరేష్, సంగిశెట్టి వేణుగోపాల్, సత్యనారాయణ, బోడిగె వినోద్, దావనూరి అజయ్, సల్ల కార్తిక్, చేరుక గణేష్, ఎర్రబోయిన వెంకన్న, మేడబోయిన కృష్ణ, బోడిగె సురేష్, బైరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.







## నూలిపురుగుల నిర్మూలనపై అవగాహన సదస్సు

**- మండలంలో 5,507 మంది పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు**

**- సోమవారం పాఠశాలల్లో ప్రత్యేక పంపిణీ**

**తొలివెలుగు, రాజాపేట:** లరాజాపేట మండల వ్యాప్తంగా సోమవారం నిర్వహించనున్న జాతీయ నూలిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి అమోస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో నూలిపురుగుల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంపిణీ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ.. సోమవారం మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ విడతలో మండల వ్యాప్తంగా మొత్తం 5,507 మంది పిల్లలను గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చందా రమేష్, ఆరోగ్య విస్తరణ అధికారి బీకు నాయక్, హెల్త్ సూపర్ వైజర్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, హెల్త్ అసిస్టెంట్లు ఉపేందర్, అనిత, అలేఖ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంకర తేలిన రోడ్డు.. కరువైన బస్సు!

**రాజాపేట - ఆలేరు ప్రయాణం ప్రాణసంకటం: రాజేశ్వర్ రెడ్డి**

**ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చొరవ చూపాలి: సాధన సమితి డిమాండ్**



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల కేంద్రం నుంచి ఆలేరు వరకు రహదారిని తక్షణమే మరమ్మతులు చేసి, ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని రోడ్డు-బస్సు సాధన సమితి సభ్యుడు నారెడ్డి రాజేశ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం రాజాపేటలో విలేకరులతో మాట్లాడిన ఆయన, ఈ మార్గంలో బస్సు సౌకర్యం లేకపోవడంతో సోమారం, బొందుగుల, లక్ష్మక్కపల్లి, పారుపల్లి, గోధుమకుంట తదితర గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాజాపేట-ఆలేరు రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో పాటు కంకర తేలిపోవడంతో వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారాయని పేర్కొన్నారు. రహదారి అధ్వాన్నంగా ఉండటంతో ఆర్టీసీ బస్సులు ఈ మార్గంలో నడవడం లేదని, దీంతో ప్రజలు ప్రైవేట్ వాహనాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రత్యేకించి ఆలేరు ఏరియా ఆసుపత్రికి వెళ్లే రోగులు, వృద్ధులు, విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. రాజాపేట మండలం హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నప్పటికీ కనీస రహదారి, రవాణా సౌకర్యాలు లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, సంబంధిత ఆర్అండ్‌బీ, ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టి, రాజాపేట-ఆలేరు మధ్య ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్యను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించి గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు.

## వ్యవసాయ బావి వద్ద విద్యుదాఘాతం: రైతు మృతి

**తొలివెలుగు, రామన్నపేట:** వ్యవసాయ భూమిలో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఒక రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలంలోని కుంకుడుపాముల గ్రామానికి చెందిన గొలుసుల వెంకన్న (38) వృత్తిరీత్యా రైతు. ఆయన తన గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో బోరు మోటారు ద్వారా సాగు చేస్తున్నాడు. శనివారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో వెంకన్న బోరు మోటారు వద్ద ఊడిపోయిన పైపును అమర్చే ప్రయత్నం చేస్తుండగా, ప్రమాదవశాత్తు మోటారుకు ఉన్న విద్యుత్ వైరు తగిలింది. దీంతో తీవ్రమైన కరెంట్ షాక్‌కు గురై ఆయన అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. మృతుడి భార్య గొలుసుల శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు రామన్నపేట ఎస్ఐ జి. సతీష్ తెలిపారు.



## చిట్యాల-భువనగిరి రహదారి విస్తరణకు నేడు శ్రీకారం





**- శంకుస్థాపన చేయనున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**- రామన్నపేటలో బహిరంగ సభ.. ఏర్పాట్లను సమీక్షించిన విప్ వేముల వీరేశం**

**తొలివెలుగు, రామన్నపేట :** రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం చిట్యాల - భువనగిరి రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదే రోజు నార్కట్‌పల్లి మండలంలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేసి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. అనంతరం రామన్నపేటలో నిర్వహించే బహిరంగ సభలో మంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు చేపట్టిన ఏర్పాట్లను ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సంబంధిత అధికారులతో కలిసి ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో సమీక్షించారు. కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులు, సంబంధిత శాఖల సిబ్బందికి ఆయన ఆదేశాలు జారీ చేశారు. సమీక్షా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జమీర్, జిల్లా నాయకులు గంగుల వెంకటరాజారెడ్డి, గుత్తా నర్సిరెడ్డి, సింగిరెడ్డి మల్లారెడ్డి, వనం చంద్రశేఖర్, మొహమ్మద్ అక్రం, జెల్లా వెంకటేశం, గోదాసు పృథ్వీరాజ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షల విరాళం

**రేకుల షెడ్ నిర్మాణానికి ముందుకొచ్చిన భక్తురాలు యెనుముల సరస్వతి**

**దివంగత యెనుముల బుచ్చయ్య స్మారకార్థంగా విరాళం**



**తొలివెలుగు, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలోని శ్రీశ్రీశ్రీ ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి భక్తురాలు, జియాగూడకు చెందిన యెనుముల సరస్వతి రూ.3 లక్షల విరాళాన్ని ప్రకటించారు. దివంగత యెనుముల బుచ్చయ్య స్మారకార్థంగా ఆలయ ప్రాంగణంలో రేకుల షెడ్ నిర్మాణం చేపట్టేందుకు ఆమె ముందుకొచ్చారు. గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ విజ్ఞప్తి మేరకు ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతను గ్రామస్థులు అభినందించారు. శనివారం సర్పంచ్ గర్దాస్ విక్రమ్ రేకుల షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు దాతల కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధి, దేవాలయాల పరిరక్షణలో దాతల సహకారం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డు సభ్యులు వడ్లకొండ లక్ష్మి మల్లేశం, వరికుప్పల స్వామి, మాజీ ఉపసర్పంచ్ సింగణబోయిన జంగయ్య, మంటి లింగస్వామి, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు రవ్వ నర్సింహా, పాల సంఘం చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం, రాజన్న మురళి, నక్క వెంకటేష్, గోళ్లేపల్లి యాదయ్య, వడ్లకొండ బిక్షం, మాజీ వార్డు సభ్యులు నిమ్మగడ్డ పద్మారావు, ఈర్లపల్లి రమేష్, సింగణబోయిన మల్లయ్య, గర్దాస్ శ్రీకాంత్, కాటేపల్లి మహేష్, సింగణబోయిన శంకరయ్య, దగ్గుల వెంకటేష్, గర్దాస్ సాయి, వెలిమినేటి నరేష్, భువనగిరి మధు, మట్ట యాదగిరి, నీరుడు కుమార్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడిపై ఎస్ఐ దురుసు ప్రవర్తన: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆగ్రహం





**- ఎస్ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ - పోలీస్ స్టేషన్‌లో సీఐకి ఫిర్యాదు**

**తొలివెలుగు, రామన్నపేట:** చేనేత సంఘ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమ భర్త రమేష్‌పై రామన్నపేట ఎస్ఐ సతీష్ అనుచితంగా ప్రవర్తించడాన్ని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన రామన్నపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐను కలిసి సదరు ఎస్ఐపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. చేనేత సంఘ ఎన్నికల విషయంలో మద్దతు తెలిపేందుకు వెళ్లిన రమేష్‌పై ఎస్ఐ దుర్భాషలాడటమే కాకుండా భౌతికంగా దాడికి పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమన్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లతోనే పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎస్ఐ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో పోలీస్ స్టేషన్ ముట్టడికి వెనుకాడబోమని హెచ్చరించారు. అనంతరం ఈ గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బద్దుల రమేష్‌ను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, నాయకత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీ

**- కుటుంబ నియంత్రణతో తల్లి-శిశు ఆరోగ్యం మెరుగుపడుతుంది: డాక్టర్ శ్రీవాణి**

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని భూదాన్ పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించడం ద్వారా తల్లి, శిశు ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు జనాభా నియంత్రణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. ప్రతి బిడ్డ జననం మధ్య కనీసం మూడు సంవత్సరాల వ్యవధి ఉండేలా కుటుంబ నియంత్రణ పద్ధతులను అనుసరించాలని సూచించారు. కుటుంబ నియంత్రణకు అందుబాటులో ఉన్న శాశ్వత, తాత్కాలిక పద్ధతులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, అవసరమైన వారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీశంకర్, సూపర్‌వైజర్ శ్రీదేవి, ఫార్మసీ ఆఫీసర్ ప్రదీప్ కుమార్, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్, బేగ్, గోపాలరావు, ఆరోగ్య ఉపకేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ రీ-సర్వే లక్ష్యం

- మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా రీ-సర్వే పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు



**తొలివెలుగు, హైదరాబాద్/యాదాద్రిభువనగిరి :** రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ భారతి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలంటే భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణి వ్యవస్థను రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. భూ భారతి అమలుకు భూ రీ-సర్వే అత్యంత కీలకమని, మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా రీ-సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూ రీ-సర్వేలో శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించిన మంత్రి, వారికి ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం రూ.10 చెల్లించి మొత్తం రూ.60 అందజేస్తామని తెలిపారు. జూలై 28లోపు విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్ల లైసెన్సులను రద్దు చేయాలని, వారికి బీమా, సామాజిక భద్రత కల్పించే చర్యలు కూడా తీసుకుంటామని చెప్పారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని, తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అవసరాలకు కొంత భూమి మాత్రమే సేకరించినప్పటికీ మొత్తం సర్వే నంబరును నిషేధిత జాబితాలో ఉంచిన సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి తొలి విడత పనులను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న రెండు పడక గదుల ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అప్పగించాలని మంత్రి ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నిధులు విడుదలైనా పనులు ప్రారంభించని చోట్ల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ తొలి విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో నవంబర్‌లోపు రీ-సర్వే పూర్తి చేయాలని, రెండో విడత పనులను మార్చి-2027 నాటికి ముగించాలని సూచించారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి పెండింగ్‌లో ఉన్న రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులకు ఆగస్టు 15 నాటికి కనీసం ఒక జత యూనిఫాంలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి సుజాత తదితర అధికారులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా బడుగు మోహన్ బాబు





- మార్కండేయ స్వామి ప్యానల్ ఘన విజయం
- వైభవంగా నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ చేనేత సహకార సంఘం (శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయం మాతృ సంస్థ) నూతన పాలకమండలిగా ఎన్నికైన 'శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ప్యానల్' కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం వైభవంగా జరిగింది. సంఘం నూతన అధ్యక్షుడిగా బడుగు మోహన్ బాబు, ఉపాధ్యక్షుడిగా గోశిక శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కాటబత్తిని భీమయ్య, కోశాధికారిగా బడుగు సావిత్రి ప్రమాణ స్వీకారం చేశారు. గౌరవ సభ్యులుగా గోశిక నరసింహ, గోశిక లక్ష్మీపతి, దోర్నాల లక్ష్మీనారాయణ, పాపని రామకృష్ణ, బత్తుల మానస బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బడుగు మోహన్ బాబు మాట్లాడుతూ.. చేనేత సంఘం అభ్యున్నతికి, కార్మికుల సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. గతంలో తన తండ్రి అందించిన ఆదర్శవంతమైన సేవలను స్ఫూర్తిగా తీసుకుని, వారి బాటలోనే నడుస్తూ చేనేత రంగాన్ని ముందుకు తీసుకెళ్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పారిశ్రామికులందరికీ అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, టీడీపీ మునుగోడు నియోజకవర్గ ఇంచార్జ్ బడుగు లక్ష్మయ్య, మాజీ ఎంపీపీ చిక్క నరసింహ, మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సంఘం మాజీ అధ్యక్షులు కందగట్ల బిక్షపతి, గోశిక చక్రపాణి, మాజీ ఎంపీటీసీ పెద్ద కృష్ణ, దేవస్థానం ధర్మకర్త బడుగు శ్రీరాములు, దేవస్థానం అధ్యక్షుడు బడుగు జయప్రకాష్, శ్రీ భావన ఋషి కళానికేతన్ అధ్యక్షుడు బడుగు బాలరాజు, ప్రముఖ చేనేత కళాకారులు బత్తుల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి శ్రీ భావనా ఋషి కళానికేతన్ ప్రతినిధులు శుభాభినందనలు తెలియజేశారు.

# ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి రోగులకు పండ్ల పంపిణీ చేసిన బీజేపీ నాయకులు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను శనివారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు సురకంటి రంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి బండి సంజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి బండి సంజయ్ విశేషంగా కృషి చేస్తున్న నాయకుడని అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజలకు చేరువగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరామ లింగస్వామి, రామిడి యాదిరెడ్డి, సీత మణికంఠ, పాండు, దోర్నాల సత్యం, ఉప్పునూతల నరసింహ తదితరులు పాల్గొన్నారు.






# ఘనంగా చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

- సంఘం అభివృద్ధి, చేనేత పరిశ్రమ పరిరక్షణకు కృషి చేస్తాం: అధ్యక్షుడు భారత లవకుమార్

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం పురపాలక కేంద్రంలోని డై హౌస్‌లో ఘనంగా నిర్వహించారు. ఎన్నికల అధికారి యూసఫ్ అలీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్యానెల్‌కు పూర్తి ఆధిక్యం లభించడంతో అధ్యక్షుడిగా భారత లవకుమార్, ఉపాధ్యక్షుడిగా సీత శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా సూరపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా కోడి బిక్షపతి బాధ్యతలు స్వీకరించారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా కడివేరు చంద్రమౌళి, గంజి బసవలింగం, భారత వాసుదేవ్, పాలాది జ్యోతి యాదగిరి, మస్నం నాగమణి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు స్థానిక శ్రీ మార్కండేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సహకార సంఘ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భారత లవకుమార్ మాట్లాడుతూ.. చేనేత సహకార సంఘ అభివృద్ధితో పాటు చేనేత పరిశ్రమ పరిరక్షణ, నేతన్నల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. సభ్యులందరి సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, మార్కండేయ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ సీత సత్యనారాయణ, కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చేనేత చీరల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు రాపోలు శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, చేనేత కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.



# కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి: బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన చిరుమర్తి లింగయ్య



**తొలివెలుగు, రామన్నపేట:** విద్యుత్ ఘాతానికి గురై మరణించిన మండల పరిధిలోని కుంకుడుపాముల గ్రామానికి చెందిన గొలుసుల వెంకన్న భౌతికకాయాన్ని శనివారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సందర్శించారు. వెంకన్న మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఆపత్కాలంలో బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయ సహకారాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇస్తూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోషబోయిన మల్లేశం, మాజీ సర్పంచ్‌లు కంభపాటి శ్రీనివాసులు, గర్దాసు విక్రమ్, బొక్క మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎంఈఓను సన్మానించిన టీయూటీఎఫ్ నాయకులు



- విద్యాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ

**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట మండల నూతన మండల విద్యాధికారి (ఎంఈఓ)గా బాధ్యతలు స్వీకరించిన తంగెళ్ల సురేందర్ రెడ్డిని తెలంగాణ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రామన్నపేట మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీయూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని విద్యా వ్యవస్థ బలోపేతం, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు కోసం విద్యాశాఖ చేపట్టే కార్యక్రమాలకు సంఘం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ విద్య మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. నూతన ఎంఈఓ తంగెళ్ల సురేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండలంలో విద్యారంగ అభివృద్ధికి ఆయన నాయకత్వంలో విశేష పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీయూటీఎఫ్ మండల నాయకులు వల్లమల భాస్కర్, ఉయ్యాల భిక్షమయ్య, పాల్వంచ హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణపై అవగాహన సదస్సు

- 13న మండల వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు మందులు అందజేయనున్నట్లు ఎంఓహెచ్ డాక్టర్ శ్రీవాణి వెల్లడి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** నులిపురుగుల నివారణ కోసం ఈ నెల 13న మండల, పట్టణ వ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం భూదాన్ పోచంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఒకటి నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు సగం మాత్ర మాత్రమే ఇవ్వాలని, మాత్రను మింగలేని పిల్లలకు దానిని పొడి చేసి నీటిలో కలిపి తాగించాలని సూచించారు. జూలై 13న పాఠశాలకు హాజరు కాని పిల్లలకు ఈ నెల 20న ప్రత్యేకంగా మరోసారి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ శ్రీవాణి కోరారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారి ప్రభాకర్, కమ్యూనిటీ ఆఫీసర్ శ్రీశంకర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.





# చౌటుప్పల్‌లో బండి సంజయ్ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ శ్రేణులు
- బీజేపీ మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను శనివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బండి సంజయ్ కుమార్ ఆయురారోగ్యాలతో ప్రజా సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ నాయకులు కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. బండి సంజయ్ నాయకత్వంలో తెలంగాణలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ఆయన కేంద్ర మంత్రిగా దేశానికి, రాష్ట్రానికి మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్, సీనియర్ నాయకులు రమణగోని శంకరయ్య, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఉబ్బు బుచ్చయ్య, కడారి ఐలయ్య యాదవ్, గుండెబోయిన వేణు, బూత్ అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రినిటీ పాఠశాలలో నారింజ రంగు సంబరాలు

- నారింజ రంగు పండ్లతో 'సి' విటమిన్ పుష్కలం: డైరెక్టర్ మంజుల
- ఆకట్టుకున్న పండ్లు, స్వీట్ల ప్రదర్శన







**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని ట్రినిటీ హైస్కూల్ ఐఐటీ జోన్‌లో ఆరెంజ్ కలర్ (నారింజ రంగు) సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ కం డైరెక్టర్ ఉజ్జిని మంజుల ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు వివిధ రకాల రంగులపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. నారింజ, కాషాయం రంగుల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. సంబరాల్లో భాగంగా నారింజ రంగులో ఉండే వివిధ రకాల పండ్లు, మిఠాయిలను ప్రదర్శనకు ఉంచారు. నారింజ రంగు పండ్లను ఆహారంగా తీసుకోవడం వల్ల శరీరానికి 'సి' విటమిన్ పుష్కలంగా లభిస్తుందని, ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ఐఐటీ జోన్ ఇన్‌చార్జ్ అనుష, కోఆర్డినేటర్ చందన, ఉపాధ్యాయులు శిరీష, హారిక, రత్న, భార్గవి, సింధు, లావణ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల సవరణ గడువును నెల రోజులు పొడిగించాలి

- అధికార యంత్రాంగం విఫలమైందని సిపిఐ నేత బోలగోని సత్యనారాయణ విమర్శ

**తొలివెలుగు, చౌటుప్పల్:** ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియను మరో నెల రోజుల పాటు పొడిగించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగోని సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం చౌటుప్పల్‌లో నిర్వహించిన సిపిఐ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లను చైతన్యపరచడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మండలంలో చాలా మందికి ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని, ఫారాలు నింపడంలో సరైన అవగాహన లేక ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి ఫారాలు పంపిణీ చేయకుండా, తమ వద్దకే వచ్చి తీసుకోవాలని చెప్పడం సరికాదన్నారు. గ్రామ స్థాయిలో గ్రామసభలు నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించేలా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా గల్లంతు కాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, మున్సిపాలిటీ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడత రామలింగం, కొండూరి వెంకటేష్, దాసరి అంజయ్య, టంగుటూరు రాములు తదితరులు పాల్గొన్నారు.




## గానకోకిలకు ఘన నివాళి

1938 – 2026

సంగీత ప్రపంచాన్ని తన మధుర గానంతో అలరించిన స్వర సామ్రాజ్ఞి ఎస్. జానకికి అశ్రునివాళి

# అక్షరాలా అమరగానకోకిల..!

ఆరు దశాబ్దాల సంగీత ప్రస్థానానికి ముగింపు.. వేలాది పాటలతో కోట్లాది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన గాన సరస్వతి.

### ఒక చూపులో

**జననం**
23 ఏప్రిల్ 1938

**సంగీత ప్రయాణం**
60+
సంవత్సరాలు

**పాడిన పాటలు**
48,000+

**భాషలు**
15+
తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, ఒడియా మరియు ఇతర భాషలు

**జాతీయ అవార్డులు**
4

**ఇతర గౌరవాలు**
అనేక రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్





యువ గాయనిగా తొలి రోజుల్లో


స్టేజ్‌పై గానం చేస్తున్న సందర్భం


అవార్డు అందుకుంటున్న సందర్భం


చిరునవ్వుతో ఎస్. జానకి

### సంగీత ప్రస్థానం

- తొలి అవకాశంతో ప్రారంభమైన గానయానం
- అన్ని ప్రధాన దక్షిణాది భాషల్లో వేలాది పాటలు
- భావవ్యక్తీకరణలో అపూర్వ ప్రతిభ
- తరతరాల అభిమానుల మనసుల్లో చిరస్థాయి స్థానం
- సంగీత దర్శకుల తొలి ఎంపికగా నిలిచిన గానరాణి

### స్వరంలో మాధుర్యం... భావంలో మంత్రం...

- వేలాది చిరస్మరణీయ గీతాలు
- ఎన్నో తరాల అభిమానుల ఆదరణ
- సంగీత దర్శకుల విశ్వసనీయ గాయని
- సూక్ష్మమైన భావాలను స్వరప్రపంచంలో విస్తరించిన సామ్రాజ్ఞి

"పాట ముగిసినా... ఆమె స్వరం ఎప్పటికీ ముగియదు."

సంగీతం ఉన్నంతకాలం...
ఎస్. జానకి పేరు చిరస్థాయిగా మార్మోగుతూనే ఉంటుంది.



# ఆఖరిదీ పోయింది

సౌతాంప్టన్: ఐర్లాండ్--ఇంగ్లండ్ టి20 టూర్‌ను భారత జట్టు ఒక్క గెలుపు లేకుండా శూన్య హస్తాలతో ముగించింది. ఫలితం తేలిన 6 మ్యాచ్‌లలోనూ జట్టు పరాజయంపాలైంది. ఐర్లాండ్ చేతిలో 0--2తో ఓడిన టీమిండియా, ఇప్పుడు ఇంగ్లండ్ చేతిలో 0--4తో ఓడటంతో కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ప్రయాణం తీవ్ర నిరాశతో మొదలైంది. శనివారం జరిగిన ఐదో టి20లో ఇంగ్లండ్ 56 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 257 పరుగులు చేసింది. భారత్‌పై ఏ జట్టుకైనా ఇదే అత్యధిక స్కోరు. జోస్ బట్లర్ (64 బంతుల్లో 131; 12 ఫోర్లు, 8 సిక్స్‌లు) అంతర్జాతీయ టి20లో తన రెండో సెంచరీతో చెలరేగగా...కెప్టెన్ హ్యారీ బ్రూక్ (45 బంతుల్లో 95 నాటౌట్; 4 ఫోర్లు, 8 సిక్స్‌లు) త్రుటిలో ఆ అవకాశాన్ని కోల్పోయాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 103 బంతుల్లోనే 233 పరుగులు జోడించడం విశేషం. అనంతరం భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 201 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (35 బంతుల్లో 56; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), తిలక్ వర్మ (25 బంతుల్లో 53; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేయగా...శ్రేయస్ అయ్యర్ (16 బంతుల్లో 28; 4 ఫోర్లు), సంజు సామ్సన్ (14 బంతుల్లో 27; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. ఇప్పటి వరకు ఐసీసీ టి20 టీమ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా ఉన్న భారత్‌ను వెనక్కి నెట్టి తాజా ఫలితంతో ఇంగ్లండ్ అగ్రస్థానానికి చేరుకుంది. ప్రసిధ్ రెండో ఓవర్లోనే సాల్ట్ (6)ను వెనక్కి పంపినా...ఆ తర్వాత బట్లర్, బ్రూక్ కలిసి చెలరేగిపోయారు. ఏ భారత బౌలర్‌నూ వదిలిపెట్టకుండా వీరిద్దరు ఆధిపత్యం ప్రదర్శించారు. పవర్‌ప్లేలో ఇంగ్లండ్ 61 పరుగులు చేయగా...అక్షర్ ఓవర్లో ఏకంగా 25 పరుగులు రాబట్టడంతో 10 ఓవర్లలో స్కోరు 111 పరుగులకు చేరింది. 19 బంతుల్లోనే బ్రూక్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ప్రిన్స్ ఓవర్లో వరుసగా 4, 6, 6, 4 బాదిన బట్లర్...అక్షర్ ఓవర్లో భారీ సిక్స్‌తో 51 బంతుల్లోనే శతకాన్ని అందుకున్నాడు. చివరి 4 ఓవర్లలో ఇంగ్లండ్ 48 పరుగులు రాబట్టింది.

# ఖైతాపురంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- దళితవాడలో వ్యవసాయ కార్మిక సంఘం ఇంటింటి సర్వే

తొలివెలుగు, చౌటుప్పల్: చౌటుప్పల్ మండల పరిధిలోని ఖైతాపురం గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగదేవి సైదులు డిమాండ్ చేశారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో ఖైతాపురం దళితవాడలో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. గ్రామంలో గత నాలుగేళ్లుగా తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని, వాటర్ ఫిల్టర్ పాడవడంతో స్థానికులు డబ్బులు పెట్టి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితవాడలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు వంటి మౌలిక వసతులు కల్పించడంతో పాటు అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సహాయం అందిస్తామన్న ప్రభుత్వ హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. సమస్యలపై అధికారులు స్పందించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బోయ యాదయ్య, యాట బాలరాజు, నేరేడు మహేష్, తగరం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

